తాండూరు మున్సిపల్‌లోకి కోకట్‌!

- గ్రామ పంచాయతీ వివరాలు తీసుకున్న ఉన్నతాధికారులు
- విలీనమైతే మండలంలో ఒక ఎంపీటీసీ స్థానం కనుమరుగు


కోకట్ గ్రామ పంచాయతీ భవనం

యాలాల: ప్రజలకు మెరుగైన సేవలు అందించే ఉద్దేశంతో పట్టణాలకు సమీపంలో ఉన్న గ్రామాలను ఆయా మున్సిపాలిటీల్లో విలీనం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. మండలంలోని మేజర్ పంచాయతీ గ్రామమైన కోకట్‌ను తాండూరు మున్సిపల్‌లో విలీనం చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే గ్రామ జనాభా, విస్తీర్ణం వారీగా నివేదికలను మండల పరిషత్ అధికారులు సిద్ధంచేసి మున్సిపల్ శాఖ అధికారులకు నివేదించారు.

ప్రజాభిప్రాయం ఎటువైపు?

యాలాల మండలంలో మొత్తం 37 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో మేజర్ పంచాయతీ గ్రామమైన కోకట్ తాండూరు పట్టణానికి దగ్గరగా ఉంది. కోకట్ పంచాయతీలో ఇందిరమ్మ, రాజీవ్ కాలనీలు సైతం ఉన్నాయి. కాగా పట్టణం నుంచి కోకట్ వరకు భారీగా నాపరాతి పరిశ్రమలు ఉన్నాయి. వీటి ఆధారంగా కోకట్ పంచాయతీలో నిధులు సైతం భారీగానే జమ అవుతున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం కోకట్ జనాభా(ఇందిరమ్మ, రాజీవ్ కాలనీలు కలుపుకొని) 4,693 మంది. పంచాయతీలో 12 వార్డుల వారీగా ఉన్నాయి. కోకట్ గ్రామంతో పాటు తాండూరు మండలంలోని చెన్గేష్‌పూర్, ఖాంజాపూర్, గౌతాపూర్ తదితర గ్రామాలను సైతం మున్సిపల్‌లో విలీనం చేసేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఒకవేళ విలీన ప్రక్రియ వల్ల కోకట్‌లో పంచాయతీలు ఎన్నికలు ఉంటాయా? లేదా మున్సిపల్‌లో విలీనం అయ్యాక ఉంటాయనే విషయంలో అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. ఉన్నతాధికారుల సూచన మేరకు గ్రామాల విలీన వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. తాండూరు మున్సిపల్‌లో కోకట్‌లో విలీనం అయితే గ్రామంతో పాటు ఒక ఎంపీటీసీ స్థానం సైతం కనుమరుగు అయ్యే అవకాశం ఉంది. ఈ విషయంలో కోకట్ గ్రామ ప్రజలు మున్సిపల్‌లో విలీనానికి ఒప్పుకొంటారా? లేదా గ్రామ పంచాయతీ కావాలంటారా.? అనే విషయాలపై సందిగ్ధం నెలకొంది.

మున్సిపల్ అధికారులకు నివేదించాం



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోకట్ జనాభా, విస్తీర్ణం, గ్రామ పటం తదితర అంశాలను మున్సిపల్ శాఖ అధికారులకు అందించాం. కోకట్ గ్రామాన్ని మున్సిపల్‌లో విలీనం చేసేందుకు పై వివరాలను మండల పరిషత్ నుంచి అడిగారు. గ్రామ పూర్తి వివరాలను రెండు రోజుల క్రితం ఉన్నతాధికారులు, మున్సిపల్ అధికారులకు అందించాం. విలీన ప్రక్రియ అనేది ప్రభుత్వ నిర్ణయం.

– యాదయ్య, ఎంపీఓ, యాలాల

సమ్మె బాటలో సమగ్ర శిక్ష ఉద్యోగులు


యాలాల: ఎంఆర్‌సీ కార్యాలయానికి తాళం

యాలాల: ఏళ్లుగా విద్యాశాఖలో విధులు నిర్వహిస్తున్న తమను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెకు దిగారు. వారు జిల్లా కేంద్రంలో జరుగుతున్న సమ్మెకు హాజరవడంతో సోమవారం మండల పరిషత్ ఆవరణలో ఉన్న ఎంఆర్‌సీ కార్యాలయానికి తాళం పడింది. ఇక్కడ విధులు నిర్వహించే ఎంఐఎస్ మండల కోఆర్డినేటర్, సీఆర్పీ, కంప్యూటర్ ఆపరేటర్ తదితరులు సమ్మెకు వెళ్లారు. సమగ్ర ఉద్యోగులను క్రమబద్ధీకరించడం లేదా మినిమం టైం స్కేల్ అందించేలా ప్రభుత్వం చొరవ చూపాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేస్తున్నారు.

సమ్మె నోటీసు అందజేత

తాండూరు రూరల్: సమగ్ర శిక్ష ఉద్యోగులు తాండూరు ఎంఈఓ వెంకటయ్యకు సోమవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పే స్కేల్, జీవిత బీమా రూ.20 లక్షలు, ఆరోగ్య బీమా రూ.10 లక్షలు, ఉద్యోగ నియామకాల్లో వెయిటేజీ తదితర డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్నామన్నారు. మంగళవారం నుంచి విధులకు హాజరుకాకుండా సమ్మెలో పాల్గొంటామని తెలిపారు. కార్యక్రమంలో వెంకటమ్మ, హరీశ్, శ్రీనివాస్, మమత, శ్రీహరి, మొగులప్ప, రాజు, రామకృష్ణలు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం


కుల్కచర్ల: జంగయ్యను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

యాలాల: మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని యువజన కాంగ్రెస్ మండల నూతన అధ్యక్షుడు వీరేశం ముదిరాజ్ అన్నారు. ఇటీవల ఆన్‌లైన్‌లో యువజన విభాగానికి జరిగిన ఎన్నికల్లో వీరేశం 380 ఓట్ల మెజార్టీతో గెలిచారు. తన గెలుపునకు కృషి చేసిన మండల నాయకులు, యువతకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా తన నియామకం పట్ల దృష్టి సారించినందుకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి రుణపడి ఉంటానన్నారు. సామాన్య కార్యకర్త స్థాయి నుంచి మండల యూత్ అధ్యక్షుడిగా నియమించినందుకు అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు.

యువజన కాంగ్రెస్ అధ్యక్షుడి ఎన్నికపై హర్షం

కుల్కచర్ల: యువజన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా ఆన్‌లైన్ ఓటింగ్ ప్రకారం చింతకాయల జంగయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నేతలు ఆయన్ని సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, నాయకులు భరత్‌కుమార్, ఆంజనేయులు, గోపాల్‌నాయక్, వెంకటయ్య, ఆనందం, బాల్‌రెడ్డి, శ్రీను, భరత్‌కుమార్‌రెడ్డి, శ్రీను, గోపాల్, నర్సింలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతల అరెస్టులు

అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంతో పోలీసుల ముందస్తు చర్యలు


పరిగిలో పోలీసుల అదుపులో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

పరిగి: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పంచాయతీ, మున్సిపాలిటీలకు పెండింగ్ బిల్లులను విడుదల చేయడం లేదని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్ ఆరోపించారు. పెండింగ్ బిల్లులకు నిరసనగా బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని సోమవారం చేపట్టడంతో పోలీసులు ముందస్తుగా నేతలను అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అరెస్టులను ఆపి పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏడాది నుంచి బిల్లులు రాక అప్పుల పాలవుతున్నామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, ఆంజనేయులు, సురేందర్, రవికుమార్, రవీందర్, బాలయ్య, జగన్, ప్రవీణ్, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యత తప్పనిసరి


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈఓ చంద్రప్ప

బంట్వారం: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని కోట్‌పల్లి తహసీల్దార్ శ్రీనివాస్ మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. సోమవారం ఆయన ఎంఈఓ చంద్రప్పతో కలిసి కోట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో వంటకాలను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. భోజనం రుచికరంగా పెడుతున్నారా లేదా అంటూ అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే ధైర్యంగా చెప్పాలన్నారు. నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సోనియమ్మ జన్మదినం

అరవై ఏళ్లుగా మగ్గిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ నెరవేర్చారని పార్టీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం ఆమె జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నేతలు ఘనంగా వేడుకలు నిర్వహించి మాట్లాడారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో పార్టీ కార్యాలయాలు, పలు కూడళ్లలో నాయకులు, కార్యకర్తలు కేకులు కోసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా సోనియాగాంధీ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.

– సాక్షి, నెట్‌వర్క్


పరిగి: ఎమ్మెల్యే నివాసంలో..


పూడూర్: పార్టీ కార్యాలయంలో వేడుకలు


ధారూరు: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు


మోమిన్‌పేటలో..


కుల్కచర్ల: ప్రధాన చౌరస్తాలో సోనియాగాంధీ పుట్టినరోజు వేడుకలు


అనంతగిరి: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

లెప్రసీ సర్వే డబ్బులు ఇవ్వండి: ఆశవర్కర్లు

ధారూరు: క్షయ వ్యాధికి సంబంధించిన కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి సమాచారాన్ని సేకరించిన తమకు ప్రత్యేక పారితోషికం ఇవ్వాలని మండలానికి చెందిన ఆశవర్కర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అలాగే తమ యూనియన్ తరఫున జిల్లా వైద్యాధికారికి సమస్యను వివరించారు. తమకు పారితోషికం ఇవ్వకుంటే భవిష్యత్‌లో లెప్రసీ సర్వే చేయకూడదని నిర్ణయించుకున్నట్లు ఆశవర్కర్లు తెలిపారు. ఈ విషయంలో జిల్లా వైద్యాధికారి తగిన చొరవ తీసుకుని పారితోషికం వెంటనే ఇప్పించాలని కోరారు.

షాదీఖానా పునః నిర్మించండి

ఎంఐఎం కొడంగల్ అధ్యక్షుడు గుల్షన్

కొడంగల్ రూరల్: శిథిలావస్థకు చేరిన షాదీఖానా స్థానంలో నూతన భవనాన్ని నిర్మించాలని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బి.గుల్షన్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. శిథిలావస్థకు చేరిన షాదీఖానాకు నూతన భవన నిర్మించాలని పలుమార్లు ధర్నాలు, నిరసనలు తెలియజేశామన్నారు. అధికారులు, ప్రభుత్వానికి ఎన్నో పర్యాయాలు వినతులు అందించినా పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి శిథిలావస్థకు చేరిన షాదీఖానాను పరిశీలిస్తూ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే నిధులు మంజూరు చేసి షాదీఖానా నిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు.

తండాలో తుల్జా భవాని పండగ

దుద్యాల్: మండల పరిధిలోని వాల్యానాయక్ తండాలో తుల్జాభవాని పండుగను ఆదివారం అర్ధరాత్రి ఘనంగా నిర్వహించారు. వానాకాలం పంటలు పూర్తయిన తర్వాత ధాన్యం ఇంటికి చేరగానే ఇంట్లో ధాన్య లక్ష్మి వచ్చిందనే సంతోషంతో ఈ పండుగను నిర్వహించుకుంటామని గిరిజనులు చెబుతున్నారు. డిసెంబర్ మొదటి వారం నుంచి జనవరి చివరి వారం వరకు ఈ వేడుకలను వివిధ తండాల్లో నిర్వహించుకుంటామని తెలిపారు. ఒక రోజు ఒక తండాలో జరిగితే వారం తర్వాత మరొక తండాలో ఏర్పాటు చేసుకుని బంధువులు వెళ్తామని చెప్పారు.

బయోప్లాస్టిక్‌తో పర్యావరణానికి మేలు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జీవమిత్ర కోఆర్డినేటర్స్

కుల్కచర్ల: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని జీవమిత్ర ఆర్గనైజేషన్ కోఆర్డినేటర్స్ సాయిభరత్‌కుమార్, ఉత్తమ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థులకు బయోప్లాస్టిక్ ఉపయోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం మనకు సాధారణంగా దుకాణాల్లో దొరికే క్యారీ బ్యాగులు ప్రమాదభరితమైనవన్నారు. అవి భూమిలో కరిగిపోవని తద్వారా భూమి కాలుష్యం అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్ రెడ్డి, స్థానిక ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'సీఎం కప్' పోటీలు

బొంరాస్‌పేట: యువత, విద్యార్థులను ఆటల్లో ప్రోత్సహించేందుకు నేటి నుంచి సీఎం కప్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకన్నగౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్, యోగా పోటీలుంటాయన్నారు. మొదటిరోజు మంగళవారం ఖోఖో, కబడ్డీ, బుధవారం వాలీబాల్, అథ్లెటిక్స్, యోగా, గురువారం మిగిలిన పోటీలుంటాయన్నారు. ఈ పోటీలను మండలంలోని విద్యార్థులు, యువకులు వినియోగించుకోవాలన్నారు. ఆన్‌లైన్ లింకు ద్వారా దరఖాస్తు చేసుకోవాలని హెచ్‌ఎంలు, గ్రామపంచాయతీల కార్యదర్శులను సంప్రదించాలన్నారు.

11న కోట్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో..

బంట్వారం: కోట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 11వ తేదీన మండల స్థాయి సీఎం కప్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ చంద్రప్ప సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఓ జట్టుకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని వివరించారు.

వైభవంగా అయ్యప్ప పడి పూజ


పూజలో పాల్గొన్న భక్తులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం శివరాంనగర్ కాలనీలో సోమవారం అయ్యప్పస్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. క్రాంతికుమార్ గురుస్వామి 18వ సారి మాలధారణ సందర్భంగా చేపట్టిన ఈ పూజలో అయ్యప్పకు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి హారతి ఇచ్చారు. స్వాములకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గాయత్రి లక్ష్మణ్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ రమేష్‌కుమార్, గురుస్వాములు నర్సింలు, అశోక్, వేణుగోపాల్, చారి, చందు, మహేష్, విద్యాసాగర్, నాయకులు సునీల్, విశ్వనాథం, విజయ్, వేణు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టులో విద్యార్థి ప్రతిభ

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల(కుంటబడి)లో మండల స్థాయి గణిత టాలెంట్ టెస్టును సోమవారం నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్టులో మండల పరిధిలోని విఠ్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి కార్తీక్ ఉత్తమ ప్రతిభను కనబరిచాడు. మండలస్థాయి టాలెంట్ టెస్టులో తృతీయ స్థానంలో రాణించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ప్రతిభ కనబరిచిన విద్యార్థి కార్తీక్‌ను ప్రధానోపాధ్యాయుడు రవి, ఉపాధ్యాయుడు శేఖర్ అభినందించారు. జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభతో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు



కుల్కచర్ల: వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కుల్కచర్ల: యూటీఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఈ నెల 14న నిర్వహించనున్న జిల్లా మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఎంతో కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ హబీబ్ అహ్మద్, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, గౌరవ అధ్యక్షుడు ఎస్.రమేశ్, నాయకులు చందర్, శంకర్, అజ్మత్, శ్రీనయ్య, కృష్ణయ్య, మహేశ్, శివప్రసాద్, వెంకటయ్య, నర్సింలు, మల్లేశ్, బాబు, శేఖర్‌రెడ్డి, ప్రవీణ్, కవిత, అయేషా, రాంరెడ్డి, అంజిలయ్య, పెంటయ్య, కరుణాకర్ పాల్గొన్నారు.

మహాసభలకు తరలిరండి

బొంరాస్‌పేట: యూటీఎఫ్ జిల్లా మహాసభలను ఈనెల 14న నిర్వహించనున్నట్లు ఆసంఘం మండలాధ్యక్షుడు గౌరారం గోపాల్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం వద్ద ఆ సంఘం జిల్లా మహాసభల గోడపత్రికను ఎంఈఓ హరిలాల్ విడుదల చేశారు. పరిగి పట్టణంలోని ఏకేఆర్ ఫంక్షన్ హాలులో జరిగే 5వ జిల్లా మహాసభలకు రాష్ట్ర నాయకులు హాజరుకానున్నారని చెప్పారు. విద్యారంగ సమస్యలు, ప్రాథమిక విద్యాభ్యాసం బలోపేతం, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం బాధ్యతలు వంటి అంశాలపై చర్చించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహాసభల నిర్వాహకులు గుంజ వెంకటయ్య, నాయకులు నరేందర్‌గౌడ్, మల్లేశ్, లక్ష్మి, అన్వర్ తదితరులున్నారు.

దుద్యాల్‌లో..

దుద్యాల్: యూటీఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సంఘం మండల అధ్యక్షుడు మల్లప్ప కోరారు. సోమవారం మండల విద్యావనరుల కేంద్రం ఎదుట మహాసభలకు సంబంధించిన గోడ పత్రికను మండల విద్యాధికారి విజయరామారావు విడుదల చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నర్సిములు, శ్రీనివాసులు, సంపత్ కుమార్, స్వాతి, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దివ్యాంగులకు ప్రోత్సాహం అవసరం


విద్యార్థికి బహుమతి అందజేస్తున్న హెచ్‌ఎం తదితరులు

తాండూరు రూరల్: దివ్యాంగులు ఎవరికీ తీసిపోరని.. అవకాశం ఇస్తే అన్ని రంగాల్లో రాణిస్తారని హెచ్‌ఎం నర్సింహారెడ్డి అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని సాయిపూర్ ప్రాథమిక పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. క్యారమ్, రింగ్ బాల్, మ్యూజికల్ చైర్, చెస్ పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐఈఆర్టీ గంగ, స్పెషల్ ఎడ్యుకేటర్ రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలనోత్సవం


విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

కుల్కచర్ల: స్వయం పరిపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండలంలోని సాల్వీడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. తమ సహచర విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న గౌరవాన్ని ఆస్వాదించి విద్యా వ్యవస్థపై తమకున్న మక్కువను చాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాంచందర్, ఉపాధ్యాయులు మన్సూర్, స్వయంప్రకాష్, తులసినాయక్, వెంకటేష్, రమేష్, ప్రసాద్, కేశవులు, శ్రీరాములు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

దోమ: ఉపాధ్యాయులు పక్షాన టీఎస్‌యూటీఎఫ్ నిరంతరం పని చేస్తుందని ఆ సంఘం మండల అధ్యక్షుడు వసురాం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మండల విద్యాధికారి వెంకట్‌తో కలిసి టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్య పరిష్కారానికి తమ సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తమ సంఘం ముందుంటుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి జంగయ్య, మెగ్యా, మల్లేశం, రాములు, ముత్యప్ప, వెంకటయ్య, రవికుమార్, పాండురంగాచారి, శోభ, రాజు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి


రషీద్ (ఫైల్)

దోమ: పత్తి నిల్వ చేసుకున్న ప్రాంతంలో నిద్రపోయిన ఓ యువకుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన దోమ మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బొంపల్లి గ్రామానికి చెందిన గౌషుద్దీన్ కుమారుడు రషీద్(20) ఆదివారం ఎప్పటిలాగే పొలం నుంచి తీసుకువచ్చిన పత్తిని నిల్వ చేశాడు. రాత్రి భోజనం చేసి పత్తిలో పడుకోగా, సోమవారం తెల్లారే సరికి విగత జీవిగా పడి ఉన్నాడు. తమ కుమారుడు గుండెపోటుతో మృతి చెందాడని తల్లిదండ్రులు బోరున విలపించారు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి పరామర్శించారు.

వివాదాస్పద గని భూమిలో సర్వే

తాండూరు రూరల్: మండల పరిధిలోని ఓగిపూర్ గ్రామంలో ఉన్న నాపరాతి గనిలో మైన్స్ అధికారులు సోమవారం సర్వే నిర్వహించారు. ఓగిపూర్ శివారులోని సర్వేనంబర్ 65లో నాపరాతి వ్యాపారులు వెంకట్రాంరెడ్డి, బసంత్‌రావు మధ్య గత కొన్ని సంవత్సరాల నుంచి సరిహద్దుల విషయంలో వివాదం నెలకొంది. గతంలో అనేకసార్లు సర్వే చేసిన అధికారులు సమస్యను పరిష్కరించలేరు. దీంతో హైకోర్టుతో పాటు మైన్స్ రాష్ట్ర డిప్యూటీ డైరక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. మైన్స్ ఏడీ సత్యనారాయణ ఆధ్వర్యంలో వివాదస్పద గని భూమిని సర్వే చేశారు. అయినా సమస్య పరిష్కరం కాలేదని.. మరోసారి శుక్రవారం మళ్లీ సర్వే చేస్తామని ఏడీ తెలిపారు. ఈ సర్వేలో మైన్స్ కార్యాలయ టెక్నికల్ అసిస్టెంట్ నాగలక్ష్మి, సర్వేయర్ లక్ష్మీకాంత్ సిబ్బంది ఉన్నారు.